క్లుప్తంగా

దరఖాస్తులు ఆహ్వానం

కోనరావుపేట: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అంచ శివకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో వందసీట్లకు గాను 17 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, టీసీతో పాఠశాలలోనే దరఖాస్తు ఇవ్వాలన్నారు.

మున్నూరు కాపు సంఘం భవనం ప్రారంభం



భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

బోయినపల్లి: మండలంలోని బూర్గుపల్లిలో శ్రీవేంకటేశ్వర మున్నూరుకాపు సంక్షేమ సంఘం సామాజిక భవనాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, వీసీ, నిమ్మ వినోద్‌రెడ్డి, సంబ లక్ష్మీరాజం, అక్కెనపెల్లి ఉపేందర్, సంఘం నాయకులు పెంచాల మహేశ్, సత్తయ్య, ప్రవీణ్, కొప్పుల నగేశ్, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలాచారి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

మండలంలోని కొదురుపాకలో ఈ నెల 11న నిర్వహించే రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి రావాలని గ్రామ గౌడ సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి ఆహ్వానించారు.

'అడ్లూరి'కి అభినందనలు

బోయినపల్లి: రాష్ట్ర నూతన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ధర్మపురి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆదివారం మండలంలోని మాన్వాడ సింగిల్‌విండో చైర్మన్ వేసిరెడ్డి దుర్గారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్‌కు పూలబొకే అందించి అభినందనలు తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



చందుర్తి: మండలంలోని మూడపల్లిలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మతల్లి బోనాలు నిర్వహించారు. సంఘం సభ్యులు ఇంటికో బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దక్కని ఇళ్లు

ఇల్లంతకుంట: ఇందిరమ్మ కమిటీల పేరుతో అనుకూలంగా ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని నిరుపేదలకు అందలేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గన్నారం నర్సయ్య ఆరోపించారు. 14 నుంచి జరిగే పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల పోస్టర్ మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. సావనపెల్లి రాములు, ప్రభాకర్, సామ నర్సింహారెడ్డి, చిట్యాల నరేశ్, తదితరులు పాల్గొన్నారు

ఉచిత గుండె వైద్యశిబిరం

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రి, మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మూరు వందమందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం సభ్యులు, ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, లక్ష్మీరాజం, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట: రేపాకలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పేద ప్రజలకు పంపిణీ చేస్తున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బిల్ల సతీశ్ కుమార్, రాంసాగర్, అంతగిరి అనిల్, రొండ్ల మధుసూదన్ రెడ్డి, డీలర్ చంద్రయ్య, హరీశ్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

బోయినపల్లి: తడగొండకు చెందిన చింతల కోటి రమేశ్ తాటిచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. రమేశ్ రోజువారీగా ఆదివారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు తాడిచెట్టు పైనుంచి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేటకు చెందిన దొంతి శిరీష ఆదివారం బస్టాండ్ ఆవరణలో తన పర్సు పోగొట్టుకుంది. లైన్‌మెన్ ఎల్లయ్యకు పర్సు దొరకగా బాధితురాలు మాజీ సర్పంచ్ కమటం రాములకు అందజేసి దొంతి శిరీషకు అందించాలని కోరారు.

అదిరే 'స్కూల్' టాయ్స్

- చిన్నారులను ఆకట్టుకునేలా స్కూల్ సామగ్రి
- మారం చేసే పిల్లలకు ప్రత్యేకం
- 12నుంచి పాఠశాలలు పునఃప్రారంభం







ఈనెల 12న బడిగంట మోగనుంది. వేసవి సెలవుల్లో ఆనందంగా గడిపిన చిన్నారులు బడిబాట పట్టనున్నారు. అయితే బడికి వెళ్లను అంటూ.. మారం చేసే పిల్లలపై తల్లిదండ్రుల్లో చింత మొదలైంది. అల్లరి.. గడుగ్గాయిల మారాన్ని దూరం చేసేలా వివిధ కంపెనీలు బడీడు పిల్లలకు నచ్చే ట్రెండింగ్ బొమ్మలతో బడికి పంపించే వేళ స్కూల్ టాయ్స్ మార్కెట్లో సందడి నెలకొంది. లోకల్, ఇంపోర్టెడ్ ప్రత్యేక మోడల్స్‌లో తయారైన బ్యాగులు, లంచ్‌బాక్సులు, వాటర్‌బాటిల్స్ విభిన్న ఆకృతుల్లో పిల్లల మనస్సును ఆకట్టుకుంటున్నాయి. దీనిపై సండే స్పెషల్ కథనం..

సిరిసిల్లటౌన్: చిన్నారులు కోరుకునే లేటెస్ట్ డిజైన్లలో బ్యాగులు, లంచ్‌బాక్సులు, వాటర్‌బాటిళ్ల షాపుల్లో సందడి చేస్తున్నాయి. పిల్లల ఇష్టానికి అనుగుణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు చల్లగా..వేడిగా నిలువ ఉండే లేటెస్ట్ వాటర్ బాటిల్స్ దొరుకుతున్నాయి. స్కూల్‌బ్యాగులు, లంచ్‌బాక్సుల్లో బార్బీడాల్, ఛోటాభీం, డోరిమెన్, పోక్‌మాన్, మోటుపత్ల, మిక్కీమౌస్, ఎఫ్‌బీ, ఆయుష్, లెవియా మోడళ్లున్నాయి. వాటర్‌బాటిళ్లలో స్టీల్, కాపర్, ఇన్సులేటెడ్, సిల్వర్ కోటింగ్‌లతో పాటు మెల్టన్ వంటి వివిధ బ్రాండుల వాటర్‌బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్లో త్రీడీ రంగులు, డిజైన్లలో బ్యాగులు, లంచ్‌బాక్సులు వస్తున్నాయి.

స్పెషల్ 'స్కూల్' థింగ్స్..

స్కూల్‌కు వెళ్లమని మారాం చేసే చిన్నారులు పాఠాల కోసం కాకుండా ఆటపాటల కోసం అనేలా తయారైన సమ్‌థింగ్ స్పెషల్‌గా స్కూల్ థింగ్స్ మార్కెట్లో దొరుకుతున్నాయి. వారి మనస్సును ఆకట్టుకునే మోడల్స్‌లో మిక్కిమౌస్, చోటా భీం, బార్బీడాల్ వంటి బొమ్మలతో కూడిన పాఠశాల వస్తువులు మార్కెట్‌ను ముంచెత్తాయి. స్కూల్ సామగ్రి ఆడుకునే వస్తువుల్లా ఉండటంతో పిల్లలు అమితంగా ఇష్టపడుతున్నారు. వాటితో పాఠశాలకు వెళ్తున్నామన్న ఫీల్ లేకుండా పోతుందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

బ్రాండెడ్ స్కూల్ టాయ్స్..

మాములు నుంచి ఇంటర్నేషనల్ బ్రాండ్ వరకు పట్టణంలో స్కూల్ టాయ్స్ అందుబాటులో ఉన్నాయి. పాఠశాలలు ప్రారంభం కానుండటంతో పట్టణంలోని పుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్మకాలతో దుకాణాలు సందడిగా మారాయి. సిరిసిల్లలోని గాంధీసర్కిల్, పాతబస్టాండ్, పెద్దబ బజార్, కొత్త బస్టాండ్, గోపాల్‌నగర్, ఆఫీస్‌రోడ్ తదితర ప్రాంతాల్లోని యాభైకి పైగా షాపుల్లో బ్యాగులు, వాటర్ బాటిళ్లు, లంచ్‌బాక్సులు అమ్ముతున్నారు. రూ.200 నుంచి రూ.2,200 వరకు వాటర్‌బాటిళ్లు, రూ.250నుంచి రూ. 2,000 వరకు స్కూల్‌బ్యాగులు, రూ.200 నుంచి రూ.1,600 వరకు లంచ్ బాక్సులు క్వాలిటీని బట్టి ధరలున్నాయి.

కొత్త మోడల్స్‌లో..



త్రీడీ డిజైన్లలో కొత్తకొత్త మోడల్స్‌లో స్కూల్‌బ్యాగులు, లంచ్‌బాక్సులు లభిస్తున్నాయి. ఆడుకునే వస్తువుల్లా కనిపించడంతో వాటిని కొనివ్వాలంటుంద్రు. పిల్లలకు కావాల్సినవన్ని బొమ్మల రూపంలో దొరుకుతున్నాయి. ధరలు కూడా రీజనేబుల్‌గా ఉన్నాయి. – ద్యావనపెల్లి అశోక్, సిరిసిల్ల

పిల్లలు మెచ్చేలా డిజైన్లు



పిల్లలు మెచ్చేలా అన్ని వెరైటీ డిజైన్లలో స్కూల్ సామగ్రిని విక్రయిస్తున్నాం. బ్రాండెడ్, లోకల్, ఇంపోర్టెడ్ రకాల బ్యాగులు, లంచ్‌బాక్సులు, వాటర్‌బాటిళ్లు వగైరా తెప్పిస్తున్నాం. ట్రెండీగా ఉండే టాయ్స్ స్కూల్ సామగ్రికి డిమాండ్ ఉంది. – కొత్త శ్రీనివాస్, వ్యాపారి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



కోనరావుపేట: కొలనూర్‌లో పనులు ప్రారంభిస్తున్న నాయకులు



ముస్తాబాద్: మద్దికుంటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆదివారం నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్దుల్ రషీద్, నాయకులు తిరుపతియాదవ్, మాజీ ఎంపీటీసీ ఇస్తారి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మద్దికుంట, గూడూరులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారన్నారు. ఎంపీడీవో బీరయ్య, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గజ్జల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శీల ప్రశాంత్, మాజీ సర్పంచ్ తిరుపతి, బాబు, కొండయ్య, లక్ష్మిపతి, బాల్‌రెడ్డి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం సొంతింటి కలను నిజం చేస్తూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. దొమ్మాటి నర్సయ్య, చిన్ని బాబు, రాంరెడ్డి, గంట లక్ష్మి, పందిళ్ల శ్రీనివాస్, బండారి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని ముస్కానిపేట, రేపాక, జవారిపేట, గాలిపెల్లి, ఇల్లంతకుంట, తదితర గ్రామాల్లో ఆదివారం 92 మంది ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసినట్లు ఎంపీవో అనిల్ తెలిపారు. మండలానికి 805 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి, ఓబులాపూర్, కస్బెకట్కూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. పార్టీ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపట్టిందన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, నాయకులు సత్తు శ్రీనివాస్ రెడ్డి, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, పొన్నాల పరుశరాములు, మునిగెల రాజు, గడ్డం మధుకర్, చెన్నమనేని ప్రశాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలుగ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాల్సిందిగా తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరంతో మూడేళ్ల చిన్నారి మృతి

- రాచర్ల బొప్పాపూర్‌లో విషాదం



హిమాన్వి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట: జ్వరంతో బాధపడుతూ ఓ చిన్నారి మృతి మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో ఆదివారం విషాదం నింపింది. గ్రామానికి చెందిన మెతుకు రాంచంద్రం–రవళి దంపతుల కూతురు హిమాన్వి(3)కి శనివారం జ్వరం రావడంతో స్థానిక ఆర్ఎంపీకి చూపించారు. వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందింది. తండ్రి రాంచంద్రం బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు.

అనారోగ్యంతో ఆలయ పర్యవేక్షకుడి మృతి



నర్సింహమూర్తి (ఫైల్)

వేములవాడ: రాజన్న ఆలయంలో పర్యవేక్షకుడిగా విధులు నిర్వహిస్తున్న గుండి నర్సింహమూర్తి(51) అనారోగ్యంతో ఆదివారం మరణించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. గత ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. మృతుడికి తల్లి, భార్య ఉన్నారు. నర్సింహమూర్తి మృతిపై ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు, బ్రాహ్మణ సంఘాల నాయకులు, పురప్రముఖులు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ప్రైవేట్ పాఠశాల ఫ్లెక్సీని తొలగించాలి

ఇల్లంతకుంట: మండలంలోని తాళ్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గేటుకు ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన అడ్మిషన్ ఫ్లెక్సీ పెట్టిన ప్రైవేట్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కోరారు. ప్రభుత్వ పాఠశాలకు గేటుకు ఫ్లెక్సీ కడితే మండల విద్యాధికారులు ఏం చేస్తున్నారన్నారు. వెంటనే ఫ్లెక్సీని తొలగించేలా మండల విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు

రంగుమారిన నీరు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లిలో ఆదివారం నల్లాల ద్వారా రంగుమారిన, దుర్వాసనతో నీరు వచ్చిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తే నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. గతంలోనూ నీటి కలుషితం జరిగి విషజ్వరాలు ప్రబలిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారులు పరిశీలించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.





నాడు జలకళ.. నేడు వెలవెల

సిరిసిల్ల: ఇది జిల్లాలోని బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మధ్యమానేరు జలాశయం. నిండా నీటితో జలాశయం ఉండగా.. శభాష్‌పల్లి ఊరు మునిగి.. ఒక్క వాటర్ ట్యాంకు మాత్రమే కొంచెం నీటిపై తేలి కనిపించేది. ఇప్పుడు నీరులేక శభాష్‌పల్లి ఊరు తేలగా ఆ వాటర్ ట్యాంకు కనిపిస్తుంది. 'మధ్యమానేరు'లో మునిగి తేలిన జ్ఞాపకాలను నిర్వాసితులు గుర్తు చేసుకుంటున్నారు. ఇది ఒక్క శభాష్‌పల్లి చిత్రాలే కాదు.. మధ్యమానేరులో మునిగిన అన్ని ఊర్ల చిత్రాలు ఇలాగే కనిపిస్తున్నాయి.



గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రంలో విద్యుద్దీపాల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పలు వార్డుల్లో దాదాపు 200 విద్యుత్ స్తంభాలకు అమర్చిన లైట్లు వెలగడం లేదు. వాటికి మరమ్మతు చేయడమో.. కొత్తవి అమర్చడం వంటి పనులు చేయడంలో పంచాయతీ అధికారులు అలసత్వం చేస్తున్నారు. రాత్రి వేళల్లో లైట్లు రాకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : రాజేశ్వర్ రావు, లక్ష్మణ్, పంచాయతీ ఈవో, గంభీరావుపేట సెల్: 9849597070

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి



కోనరావుపేట : బావుసాయిపేటలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



ఇల్లంతకుంట : రామాజీపేటలో..

కోనరావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి మురళినాయక్ అన్నారు. మండలంలోని బావుసాయిపేటలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గోవిందరావుపేట తండాలో తల్లిదండ్రులతో ప్రజాప్రతినిధులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పెద్దఎత్తున ప్రభుత్వం నిధులను వెచ్చించి అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కవిత, అంగన్‌వాడీ టీచర్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ జగన్ నాయక్, తల్లిదండ్రులు రమేశ్, వసీలాల్, సంతోష్, తిరుపతి, మహేశ్, వెంకటేశ్, సరిత, మౌనిక, రాజేశ్వరి, సునీత, జ్యోతి, గోవిందరావుపేట యువకులు, తదితరులు హాజరయ్యారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలుగ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాల్సిందిగా తల్లిదండ్రులను కోరారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రుద్రంగి : సమావేశమైన పూర్వ విద్యార్థులు

రుద్రంగి: మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1999–2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహిచారు. ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు.పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లకల్చరల్: విజ్ఞానవర్ధిని శిశుమందిర్‌లో 1982–86 విద్యా సంవత్సరంలో ఏడో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం తంగళ్లపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో మేర్గు శ్రీనివాస్, మూడ నాగరాజు, సుంకు దేవేందర్, చిట్టిమల్ల ప్రవీణ్‌కుమార్, టి శ్రీనివాస్, రాము, పబ్బ శ్రీనివాస్, నిజాం శ్రీనివాస్, రాంప్రసాద్, కృష్ణవేణి, సరిత, మంజుల ఉమారాణి, జయశ్రీ, వర్ష తదితరులు పాల్గొన్నారు.

మాగంటి గోపీనాథ్‌కు నివాళి



మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

సిరిసిల్లటౌన్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపట్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ నేతలు సంతాపం తెలిపారు. ఆదివారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో గోపినాథ్ మృతికి సంతాప తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర నాయకుడు గూడూరి ప్రవీణ్, న్యాలకొండ రాఘవరెడ్డి, లక్ష్మీనారాయణ, కుంభాల మల్లారెడ్డి, మాట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ నాయకులు నివాళి అర్పించారు. మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు కార్యాలయంలో మాగంటి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, అందె సుభాష్, ఎడ్ల సందీప్, నర్సింహారెడ్డి, సీత్యానాయక్, నర్సింలు, మురళి, సుధాకర్ రావు తదితరులున్నారు.

ముస్తాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆర్మీ మాజీ అధికారికి కన్నీటి వీడ్కోలు



నివాళి అర్పిస్తున్న సైనికులు

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన మాజీ ఆర్మీ అధికారి పాటి దేవయ్య (71)కు మాజీ సైనికులు ఆదివారం కన్నీటి వీడ్కోలు పలికారు. దేవయ్య శనివారం సాయంత్రం మృతిచెందగా ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. భారత సైన్యంలో సుదీర్ఘకాలం పనిచేసిన దేవయ్య హఠాన్మరణం చెందడం అందరినీ కలచివేసింది. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా మాజీ సైనికులు నివాళి అర్పించారు. జాతీయ జెండాను ఆయన మృతదేహంపై ఉంచారు. మాజీ ఆర్మీ అధికారి మృతిపట్ల పట్టణంలోని పలువురు నివాళి అర్పించారు.